క్లుప్తంగా

వైద్యులను నియమించాలి

కాజీపేట: ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు సరైన వైద్య సేవలను అందించడం కోసం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌లో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. కాజీపేట పట్టణంలో తెలంగాణ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ వెల్‌నెస్ సెంటర్‌లో నిపుణులైన వైద్యులు లేనికారణంగా సరైన వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని, వైద్య నిపుణులను నియమించాలని సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదించారు. సమావేశంలో సంఘం బాధ్యులు బి.నరహరి, తిరుమల్, నరేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో మిలాద్ ఉన్ నబీ

న్యూశాయంపేట: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ కేయూ క్రాస్‌రోడ్డులోని వరంగల్(జీ1) బాలికల గురుకులంలో శనివారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకల్లో మైనార్టీ ఇంటిలెక్చువల్ ఫోరం చైర్మన్ డాక్టర్ అనీస్ సిద్దిఖీ పాల్గొని మహ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో గురుకులాల రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ డాక్టర్ జంగా సతీష్, విజిలెన్స్ అధికారులు సయ్యద్ అక్బర్, మక్బూల్‌పాషా, అకడమిక్ కోఆర్డినేటర్ రుహీనా, జేఐహెచ్ బాధ్యులు ముజాహిద్ ఇర్ఫాన్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో చెలగాటం

విద్యారణ్యపురి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్ఏ స్టాలిన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 15 నుంచి డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు నిర్వహించే అన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కళాశాలలను బంద్ చేసేందుకు నిర్ణయించాయని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



న్యూశాయంపేట: కాంగ్రెస్ వరంగల్ జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ మహ్మద్ అయూబ్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతిచెందారు. ఈ మేరకు 21వ డివిజన్ శాంతినగర్‌లో బాధిత కుటుంబ సభ్యులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు శనివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

స్పీకర్‌కు ఎంపీ కావ్య స్వాగతం



హన్మకొండ చౌరస్తా: తిరుపతిలో జరగనున్న మహిళా సాధికారత సాధన మొదటి జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు తిరుపతి విమానాశ్రయంలో వరంగల్ ఎంపీ కావ్య పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సదస్సులో దేశంలోని వివిధ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సుమారు 300ల మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల సాధికారత, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వారి చురుకైన పాత్రను మరింతగా వెలుగులోకి తీసుకురానున్నట్లు కావ్య తెలిపారు. మహిళల సంక్షేమానికి అనేక కీలక నిర్ణయాలు తీసుకునే ఈ కార్యక్రమం సమాజానికి గొప్ప మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు.

ఆలయంలో మహిళల హల్‌చల్

హన్మకొండ కల్చరల్: హనుమకొండ వేయిస్తంభాల గుడి ప్రాంగణంలో శనివారం ఇద్దరు మహిళలు హల్‌చల్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళలు చెప్పులు వేసుకొని ఆలయ మెట్లు ఎక్కుతుండడంతో చెప్పులతో గుడిలో ప్రవేశించకూడదని భక్తులు చెప్పడంతో తాము ఇలాగే వెళ్తాం.. అడగడానికి మీరెవరని ఆ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వారు మాట్లాడారని, దాడికి ప్రయత్నించారని పలువురు తెలిపారు. ఈ క్రమంలో సదరు మహిళలే పోలీసులకు ఫోన్ చేసి భక్తులపై ఫిర్యాదు చేయగా, దేవాలయానికి చేరుకున్న పోలీసులు వారిని హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ వేయి స్తంభాల దేవాలయాన్ని వివిధ దేశాల నుంచి టూరిస్టులు సందర్శించి ఆలయ చరిత్ర, శిల్పకళా నైపుణ్యాన్ని చూసి ఆశ్చర్యపోతారు. హిందూ దేవాలయాల్లో అన్యమత ప్రచారం తగదని ఆయన హితవు పలికారు.

ఫోర్టిఫైడ్‌తో ఆరోగ్యం

రేషన్ బియ్యంలో పోషకాలు

- బ్లాక్‌మార్కెట్‌లో బియ్యం విక్రయించొద్దు
- ఆహారంగా తీసుకుంటే పెరుగనున్న రోగనిరోధక శక్తి
- రక్తహీనత అధిగమించవచ్చని సూచిస్తున్న వైద్యులు



వరంగల్ జిల్లాలో రేషన్‌షాపుల వివరాలు

ఖిలా వరంగల్: రేషన్ బియ్యాన్ని నల్లబజారులో విక్రయిస్తున్నారా.. అయితే డబ్బు ఖర్చు చేయకుండా వచ్చిన పోషకాలను కోల్పోయినట్లే. కిలోకు రూ.10 లేదా రూ.15 కోసం ఆ బియ్యాన్ని విక్రయిస్తే.. తర్వాత ఆస్పత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని వరంగల్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. జాతీయ పోషకాహార సంస్థ కూడా ఇదే విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది. అవగాహన లేక కొందరు లబ్ధిదారులు ఫోర్టిఫైడ్ రేషన్ సన్న బియ్యాన్ని నల్లబజారులో విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఆహార భద్రత నుంచి పోషకాహార భద్రత కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. పౌరసరఫరాల శాఖ రెండేళ్లుగా ఫోర్టిఫైడ్ రైస్‌ను జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి జిల్లాలోని 509 షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ ప్రారంభించింది. జిల్లాలో పాతకార్డులు 2,66,429 కాగా.. నూతనంగా జారీచేసిన 16,251 కార్డులతో 282,680 కార్డులు ఉన్నాయి. లబ్ధిదారులకు 53,82,518 టన్నుల సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. అయితే ఇందులో ప్రతి నెలా 5 నుంచి 10 శాతం రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లబ్ధిదారులు ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన పెంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అపోహలు వద్దు..

చిన్నారులు, యువకులు, గర్భిణుల్లో 35 నుంచి 50 శాతం రక్తహీనత ఉన్నట్లు జాతీయ కుటుంబ సర్వే నివేదిక పేర్కొంది. ఎలాంటి అపోహలు లేకుండా ఫోర్టిఫైడ్ రైస్‌ను ఆహారంగా తీసుకుంటే ఈ సమస్యను అధిగమించొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మహిళలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పురుషులు తీసుకునే మొత్తం ఆహారంలో ఐరన్ వరుసగా 13 మిల్లీగ్రాముల నుంచి 15.19 మిల్లీగ్రాములు ఉన్నట్లు నివేదిక తేల్చింది.

పోషకాలు ఎంత మేర కలుపుతారంటే..

ఒక బ్యాగుకు 28 నుంచి 42.5 మిల్లీగ్రాముల వరకు ఐరన్ (ఫెర్రిక్ పైరోపాస్ఫేట్) కలుపుతారు. దీనికి బదులు సోడియం ఐరన్ 14 నుంచి 25.25 మిల్లీగ్రాములు కలుపుతారు. ఒక బ్యాగుకు 75 నుంచి 125 మిల్లీగ్రాముల వరకు ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ-12 కోసం హైడ్రాక్సై కో బలమైన పోషకాలు, జింక్, విటమిన్ ఏ, థయమిన్, రైబోఫ్లావిన్, నియాసిన్, విటమిన్ బీ6, పోషకాలు కలుపుతారు. ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం ద్వారా మహిళల్లో రక్త హీనత సమస్య ఉండదు. చిన్న పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇందుకోసమే బియ్యాన్ని హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకాల్లో వినియోగిస్తున్నారు.

ఫోర్టిఫైడ్ రైస్ తయారీ ఇలా..

పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు కలిపి ఆహారాన్ని బలవర్ధకం చేయడాన్నే ఫోర్టిఫైడ్‌గా పరిగణిస్తారు. ఈ బియ్యాన్ని తొలుత పిండిగా మార్చి.. దానికి ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ-12 వంటి విటమిన్లు కలుపుతారు. ఆ పిండిని బియ్యం రూపంలో కెర్నెల్స్‌గా మార్చుతారు. ప్రతి 100 కిలోల బియ్యంలో ఒక కిలో ఫోర్టిఫైడ్ కెర్నల్స్‌ను కలుపుతారు. ఈ బియ్యాన్ని రైస్ మిల్లుల్లోని సంచుల్లో నింపి జిల్లాలోని ఎఫ్‌సీఐ గోదాముల్లో భద్రపరుస్తారు. ఆ తర్వాత వరంగల్, వర్ధన్నపేట, నర్సంపేటలోని ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరవేసి అక్కడి నుంచి నేరుగా రేషన్ దుకాణాలకు తరలిస్తున్నారు.

బియ్యాన్ని వినియోగించాలి



రేషన్ దుకాణాల్లో పంపిణీ జరుగుతున్న ఫోర్టిఫైడ్ కెర్నెల్స్ బియ్యాన్ని లబ్ధిదారులు ఆహారంగా తీసుకోవాలి. దుకాణాల్లో తీసుకున్న బియ్యాన్ని ఇతరులకు విక్రయించకుండా ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారు. రక్తహీనతను అధిగమించవచ్చు. చిన్న పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతోంది. రేషన్ బియ్యాన్ని వినియోగించాలి.

– డాక్టర్ నరేశ్‌కుమార్, వైద్యమండలి ఉమ్మడి జిల్లా సభ్యుడు

ప్రాణత్యాగం చేసింది కమ్యూనిస్టులే

- సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ బాష్‌మియా

ఖిలా వరంగల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల్లో ప్రాణాలు త్యాగాలు చేసింది కమ్యూనిస్టులేనని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా అన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట శివారులోని అంబేడ్కర్ నగర్‌లో చిట్యాల సువర్ణ అధ్యక్షతన రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17న తెలంగాణ విలీనాన్ని అధికారికంగా నిర్వహించాలని సూచించారు. సమైక్య రాష్ట్రంలో దుమ్మెత్తిపోసిన నాటి సీఎం కేసీఆర్.. 2021 నుంచి సమైక్యతా దినోత్సవం పేరుతో తెలంగాణ వీర చరిత్రను కనుమరుగయ్యేలా చేశారని ఆరోపించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన రద్దయిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, జాన్‌పాల్, చిరంజీవి, బాబుకుమార్, ప్రభాకర్, కరుణాకర్, రమేష్, దివ్య, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.

నిజాంకు వ్యతిరేకంగా పోరాటాలు



మాట్లాడుతున్న భిక్షపతి

హసన్‌పర్తి: సీపీఐ ఆధ్వర్యంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి నాలుగు వేల గ్రామాలకు విముక్తి కల్పించి, పది వేల ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేసినట్లు సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాన్ని హసన్‌పర్తి మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతితో కలిసి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేష్, నాయకులు దొమ్మటి ప్రవీణ్‌కుమార్, షేక్ బాబు, రేణికుంట్ల రాజయ్య, నేదునూరి సాంబయ్య, గోపరాజు భద్రయ్య, బందెల తిరుపతి, సుధాకర్, అజయ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



మహిళల కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ వెంకటయ్య, తదితరులు

మామునూరు: చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వెంకటయ్య, వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్ సుదర్శన్ రెడ్డి అన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో కాకతీయ యూనివర్సిటీ ఇంటర్నల్ టోర్నమెంట్స్ ఫర్ ఉమెన్ -2025 ఆధ్వర్యంలో వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సహకారంతో క్రీడాపోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా వారు పాల్గొని క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల పట్ల మక్కువ పెంచుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వాగ్దేవి ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్‌రెడ్డి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ నేచురల్ గ్యాస్ కనెక్షన్లు



గ్యాస్ కనెక్షన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సురేఖ

వరంగల్ చౌరస్తా: అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటైన వరంగల్‌లో తొలి పైపులైన్ నేచురల్ గ్యాస్‌ను ప్రారంభించినట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ ఓసిటీలో మెఘా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌ను శనివారం నెలకొల్పిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులర్ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జయప్రకాశ్, ప్రతినిధులు వెంకట అవినాష్, హరి, రఫీ, ఆదిత్య, రాజు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పీఏసీఎస్ సభ్యులపై వేటు

- రుణాలు చెల్లించకపోవడంతో అనర్హత
- పదవుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు
- మరికొన్ని సొసైటీల్లో డిఫాల్టర్లు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని ఐదుగురు సభ్యులపై వేటు పడింది. ఈ మేరకు జిల్లా సహకార శాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీ పరిధిలో మొత్తం 13 మంది సభ్యులు ఉండగా ఇప్పటికే మేరుగుత్తి కల్యాణ అనే డైరెక్టర్ రాజీనామా చేశారు. మిగిలిన 12 మందిలో పాశం జయపాల్‌రెడ్డి, సముద్రాల రాజ్‌కోటి, తెట్టె గణేష్, బండి శారద, అశోక్ సొసైటీ నుంచి వ్యవసాయంతో పాటు వ్యవసాయేతర రుణాలు పొందారు. రుణం పొందినప్పటి నుంచి ఇప్పటివరకు తిరిగి చెల్లించలేదు. సొసైటీ రుణాల జాబితాను పరిశీలించిన అధికారులు.. అందులో వారు డైరెక్టర్లుగా ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు వారిని డిఫాల్టర్లుగా పరిగణిస్తూ పదవి నుంచి తప్పించారు. మరికొన్ని సొసైటీల్లో కూడా కొంతమంది డైరెక్టర్లు డిఫాల్టర్లుగా పరిగణించినట్లు తెలిసింది. నేడోరేపో వారిని కూడా అనర్హులుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఇమ్యూనైజేషన్‌తో వ్యాధులు దూరం

డిప్యూటీ మాస్ మీడియా అధికారి అనిల్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న అనిల్‌కుమార్

ఖిలా వరంగల్: ఇమ్యూనైజేషన్ వ్యాక్సిన్లు తీసుకోవడం వలన పిల్లలకు క్షయ, పోలియో, కామెర్లు, కంటి సర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, మెదడువాపు, న్యుమోనియా, మీజిల్స్, రూబెల్లా, జ్వరం, శ్వాసకోశ, నీళ్ల విరోచనాలు, కడుపు నొప్పి, అంధత్వం వంటి వ్యాధుల రాకుండా ఉంటాయని డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఈదురు అనిల్‌కుమార్ అన్నారు. వరంగల్ రంగశాయిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఉర్సు ఆస్పత్రి, మాలవాడ అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా టీకాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతీక్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, హెడ్ నర్స్ భాగ్యలక్ష్మి, సుజాత, శారద, భాగ్యలక్ష్మి, విజయ, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, రాణి, ఆశ కార్యకర్తలు శారద అనిత, సుమిత్ర, మమత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో గ్రీన్ డే



గ్రీన్ డేలో చిన్నారులు, మహిళలు

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండ సెక్టార్ రాంపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గ్రీన్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి వచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ శారద మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యానికి ఆకుకూరలు ఎంతో శ్రేష్టమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రం సేవలను చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తల్లుల కమిటీ అధ్యక్షురాలు నాయిని సరిత, ఆశవర్కర్ రజిత, మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



జెండాను ఆవిష్కరిస్తున్న దేవేందర్

హన్మకొండ చౌరస్తా: ఎన్నికల వేళ ముదిరాజ్‌లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ కోరారు. మెపా ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్ కాలనీలోని మెపా కార్యాలయం నుంచి కేయూ క్రాస్, నయీంనగర్, పబ్లిక్ గార్డెన్, హనుమకొండ చౌరస్తా మీదుగా గుడిబండల్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో దేవేందర్ మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని సూచించారు. తమ హక్కులను సాధించే వరకు పార్టీలకు అతీతంగా ముదిరాజ్‌లను ఐక్యం చేసి పోరాడుతామని హెచ్చరించారు. ముదిరాజ్‌లలో వెనుకబడిన వారిని ప్రోత్సహించడమే మెపా లక్ష్యమని చెప్పారు. తొలుత మెపా జెండాను పులి దేవేందర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మెపా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు సంకెళ్ల శ్రీధర్, బాధ్యులు పొన్నం రాజు, నీరటి రాజు, బోనాల రమేష్, పులి ప్రభాకర్, పులి రాజేష్, గోనెల విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా


డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

హసన్‌పర్తి: 55వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ జక్కుల రజిత అన్నారు. భీమారంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అలాగే, రామారంలో మున్నూరు కాపు సంఘం కోసం ఏర్పాటు చేసిన షెడ్‌ను కార్పొరేటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సంగాల ప్రేమ్‌కుమార్, నాయకులు పరమేశ్వర్, సంగాల చిట్టిబాబు, సంగాల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

న్యూశాయంపేట: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధి 14వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన సుమారు 30 మంది హనుమకొండ సుబేదారిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

28న పద్మశాలి పురస్కారాల ప్రదానం



ఖిలా వరంగల్: ఈ నెల 28న హనుమకొండలో నిర్వహించనున్న పద్మశాలి ప్రతిభా పురస్కారాలు కరపత్రాలను శివనగర్‌లోని పోపా కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులు ఈ నెల 20వ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పద్మశాలీలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోపా జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్, ఆడెపు శ్యామ్, సుధాకర్, బత్తుల సత్యం, రాజగోవిందు, శ్యాంసుందర్, వట్నాల సత్యనారాయణ, గుండేటి సతీష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పండ్ల పంపిణీ

విద్యారణ్యపురి: సైకిల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రతాపరుద్ర కాలనీలో పారిశుద్ధ్య కార్మికులకు అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి శనివారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత కోసం పారిశుద్ధ్య కార్మికులు రోజూ కష్టించి పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఈ క్రమంలో ప్రభుత్వ పరంగా వారికి రావాల్సిన వేతనాలను సకాలంలో అందించి ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి అనంత్‌కుమార్, బాధ్యులు సుదర్శన్, మల్లయ్య, భద్రయ్య, సుకన్య, కార్మికుల సంగాల బాధ్యులు ఉప్పలయ్య, రమ, గీత, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖను కలిసిన నాగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు

ఖిలా వరంగల్: మంత్రి కొండా సురేఖను వరంగల్ ఉర్సు ప్రతాప్‌నగర్‌లోని నాగేశ్వరస్వామి దేవాలయ నూతన కార్యవర్గం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోశాల పద్మ, చైర్మన్ తోట నర్సింగం, వేణు, అనిల్‌కుమార్, లావణ్య, జగన్నాథం, సంధ్య పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో కేన్సర్ దూరం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మహేష్

హన్మకొండ అర్బన్: మద్యపానం, పొగాకుకు దూరంగా ఉంటూ మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకుంటూ వ్యాయామం చేస్తే కేన్సర్ దరిచేరదని స్టార్ ఆస్పత్రి కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ బెజగం మహేష్ సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని హోటల్ థౌసండ్ పిల్లర్స్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కేన్సర్‌పై శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కేన్సర్‌పై సరైన అవగాహన పెంచుకోవాలన్నారు. మొదటి దశలోనే కేన్సర్ కారకాలను గుర్తిస్తే వ్యాధిని సులభంగా తగ్గించవచ్చని వివరించారు. ప్రతినెలా 2వ శనివారం శ్రీచక్ర ఆస్పత్రిలో తాను అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ వేముల ప్రసాద్, డాక్టర్ గోపినాథ్, క్లబ్ అధ్యక్షుడు బేతి రవీందర్ రెడ్డి, గంగోజుల నరేష్, రాజ్‌కుమార్, వంగ రాజిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపిక



సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జోనల్ స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు జోనల్ చైర్మన్ అటికం రవీందర్ తెలిపారు. ఈ నెల 15న భీమదేవరపల్లిలో జరగనున్న పోటీల్లో వారు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులను రైతు బంధు సమితి జిల్లా మాజీ కార్యవర్గ సభ్యుడు విక్టర్ బాబు, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు రమేష్, లింగమూర్తి, దేవేందర్ అభినందించారు.

బొడ్డెమ్మ ఆటపాటల సందడి



హన్మకొండ కల్చరల్: బొడ్డెమ్మ పండుగలో భాగంగా రెండో రోజు హనుమకొండ చీకటివాడలోని మహిళలు, యువతులు ఆటపాటలతో శనివారం సందడి చేశారు. అనేక దశాబ్దాలుగా కలిసిమెలసి బొడ్డెమ్మను ఏర్పాటు చేసుకుని తొమ్మిది రోజులపాటు ప్రతిరోజు పూలతో అలంకరించి పండుగ జరుపుకుంటున్నట్లు కాలనీ మహిళలు తెలిపారు.